సాక్షి
కామారెడ్డి

ఆదివారం । 11 । మే । 2025



అభివృద్ధి చెందాలి
మహిళా సంఘాల సభ్యులు స్వశక్తితో ఆర్థికాభివృద్ధి సాధించాలని అధికారులు సూచించారు.
- 11లో ▸



పదేళ్లయినా..
దోమకొండలో మినీ స్టేడియం నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. పదేళ్లవుతున్నా అసంపూర్తిగానే ఉన్నాయి.
- 11లో ▸

గరిష్టం/కనిష్టం
40.2 /24.1

వాతావరణం
ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

‘భూభారతి డెస్క్ వర్క్ నిర్వహించాలి’



లింగంపేట: భూభారతి డెస్కు వర్క్‌ను వేగంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ విక్టర్ రెవెన్యూ సిబ్బందికి సూచించారు. శనివారం ఆయన పోతాయిపల్లి, నల్లమడుగు, కోమట్‌పల్లి గ్రామాల్లో భూభారతి సర్వేకు సంబంధించిన డెస్కు వర్క్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భూభారతి చట్ట ప్రకారం భూ సర్వే నిర్వహించి అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలని సూచించారు. అనంతరం ఆయా గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. రైతులకు కనీస వసతులు, సౌకర్యాలు కల్పించాలని, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. ఆలయన వెంట రెవెన్యూ, సింగిల్ విండో సిబ్బంది, రైతులు ఉన్నారు.

‘2.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాం’



నాగిరెడ్డిపేట: జిల్లాలో ఇప్పటివరకు సుమారు 2.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు డీసీవో రామ్మోహన్ తెలిపారు. శనివారం ఆయన వాడి, చీనూర్, నాగిరెడ్డిపేట, మాల్తుమ్మెద, గోలిలింగాల, లింగంపల్లికలాన్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూకం చేసిన ధాన్యం సంచులపై టార్పాలిన్లను కప్పి ఉంచాలని, ధాన్యం బస్తాలను వెంటవెంటనే రైస్‌మిల్లులకు పంపాలని ఆదేశించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో సహకార సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో ఇప్పటివరకు 2,06,061 మెట్రిక్ టన్నుల ధాన్యం, ఐకేపీ ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో 73,195 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. సుమారు 2.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి రూ.4.87 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. ఆయన వెంట మానిటరింగ్ అధికారి నర్సింలు, మాల్తుమ్మెద సొసైటీ సీఈవో సందీప్‌కుమార్ ఉన్నారు.

18 నుంచి బజరంగ్‌దళ్ ప్రశిక్షణ వర్గ

ఎల్లారెడ్డి: బజరంగ్‌దళ్ ప్రశిక్షణ వర్గను ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు బజరంగ్‌దళ్ ప్రతినిధులు తెలిపారు. కరీంనగర్‌లోని శ్రీసరస్వతి శిశు మందిర్‌లో వారం రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమానికి వెళ్లే వారు ఎల్లారెడ్డి బజరంగ్ దళ్ ప్రతినిధుజీలను సంప్రదించాలని సూచించారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



మాచారెడ్డి : చుక్కాపూర్‌లోని లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం సేవాకాలం శాంతిపాఠం నిర్వహించారు. అనంతరం ద్వారతోరణ పూజలు, మూలమంత్ర హవనం, ఉత్సవ మూర్తులకు పంచామృతాలు, పండ్ల రసాలతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కమలాకర్ రెడ్డి, ఈవో శ్రీధర్‌రావ్, డైరెక్టర్లు లక్ష్మీరాజం, రాజిరెడ్డి, ఆంజనేయులు, బాల్‌రెడ్డి, ఆలయ సిబ్బంది సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన

బాల్కొండ: బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలో శనివారం రాత్రి అకాలవర్షం దంచి కొట్టింది. దీంతో కల్లాల్లో ఉన్న సజ్జలు, నువ్వులు, కొనుగోలు కేంద్రాల్లోని వరి ధాన్యం తడిసి ముద్దయింది. సుమారు 40 నిమిషాలపాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

మా తుజే సలామ్!

నవమాసాలు కడుపున మోసి, కని పెంచిన కనిపించే దైవం అమ్మ.. ఆమె ప్రేమకు ప్రతిరూపం.. త్యాగానికి మారుపేరు.. పిల్లలు ఎక్కడ ఉన్నా క్షేమంగా ఉండాలని కాంక్షిస్తుంది. తానేమైపోయినా పర్వాలేదు బిడ్డ మాత్రం ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటుంది. తన ఆయుష్షును పోసుకుని నిండునూరేళ్లు బతుకుమని ఆశీర్వదిస్తుంది. అవసరమైతే తన అవయవాలను ఇవ్వడానికీ వెనుకాడదు. ఆదివారం అంతర్జాతీయ మాతృదినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనాలు..



- సైన్యంలో 23 మంది తాడ్వాయివాసులు
- దేశ సరిహద్దుల్లో యుద్ధమేఘాలతో కొంత భయం
- బిడ్డలకు జాగ్రత్తలు చెబుతున్న తల్లులు

నేడు మాతృ దినోత్సవం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : క్రీడలు, క్రీడాకారులకు నిలయమైన తాడ్వాయి మండల కేంద్రం దేశ సేవలోనూ ముందుంది. ఆ ఊరు నుంచి ఇప్పటివరకు 23 మంది సైన్యంలో చేరగా.. రవీందర్‌రెడ్డి అనే సైనికుడు ఏడాది క్రితం అనారోగ్యంతో చనిపోయాడు. ప్రస్తుతం 22 మంది సైన్యంలో ఉన్నారు. ఆదివారం మాతృ దినోత్సవం సందర్భంగా సైనికుల తల్లులతో ‘సాక్షి’ ముచ్చటించింది. తమ పిల్లలు సైన్యంలో పనిచేయడం తమకు గర్వంగా ఉందని, పాకిస్థాన్ చేస్తున్న దాడులతో కొంత భయపడుతున్నామని వారు పేర్కొన్నారు. తమ బిడ్డలకు రోజూ ఫోన్ చేసి జాగ్రత్తలు చెబుతున్నామన్నారు. ‘‘దేవుళ్లను నమ్ముకున్నోళ్లం, దేవుడి మీద భారం వేశాం’’ అని ఆ తల్లులు వివరించారు.



తాడ్వాయి గ్రామానికి చెందిన సైనికుల తల్లులు

ఒక్కరితో మొదలై..

గ్రామానికి చెందిన గుట్టకాడి సంజీవరెడ్డి 15 ఏళ్ల నాడు సైన్యంలో చేరారు. తర్వాత ఆయన స్ఫూర్తితో గ్రామానికి చెందిన యువత సైన్యంలో చేరసాగారు. గుట్టకాడి సంజీవరెడ్డి, మ్యాదరి ఎల్లేశ్, మర్రి మహేశ్, మర్రి ప్రశాంత్, లింగమ్మల మనోజ్, హన్మంతుల స్వామి, బెస్త సంజయ్, పీసు సంజీవరెడ్డి, టేకుల రాజు, దాసరి నరేశ్‌రెడ్డి, ఆకిటి ప్రశాంత్‌రెడ్డి, కీసరి నవీన్, కమ్మరి నవీన్, ప్రదీప్‌రావు, గొల్ల సంతోష్, మిద్దె కల్యాణ్, సుర్కంటి సతీష్‌రెడ్డి, సాయిరాంగౌడ్, రాజిరెడ్డి, ముదాం రాహుల్, సాకలి అనిల్, గాండ్ల భానుతేజ సైన్యంలో ఉన్నారు. దాదాపు అందరూ దేశ సరిహద్దు ప్రాంతాల్లోనే పనిచేస్తున్నారు.



తాడ్వాయిలో సైనికులు ఏర్పాటు చేసిన సుభాష్ చంద్రబోస్ విగ్రహం

సేవా కార్యక్రమాల్లోనూ ముందు..

గ్రామానికి చెందిన సైనికులంతా కలిసి సొంత డబ్బులతో గ్రామంలో ప్రధాన రహదారిపై సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. యువతను సైన్యంలో చేరాలంటూ ప్రోత్సహిస్తుంటారు. అనేక సేవా కార్యక్రమాలు కూడా చేపడుతున్నారు.

దైవం మాతృ రూపేణ..

బిడ్డలకు కిడ్నీలు ఇచ్చి పునర్జన్మను ప్రసాదించిన తల్లులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : నవమాసాలు మోసి బిడ్డల్ని కన్న తల్లులు.. వారికి మంచి భవిష్యత్తు ఇవ్వడానికి ఎన్ని కష్టాలు ఎదురైనా సరే భరిస్తారు. బిడ్డలు ఎదిగే క్రమంలో ఏదైనా ఆపద వస్తే తన ప్రాణాన్ని అడ్డు పెట్టయినా కాపాడుకోవడానికి ప్రయత్నిస్తారు. అవసరమైతే తన ఆయుష్షు తీసుకునైనా బిడ్డను కాపాడు తండ్రీ అంటూ తను నమ్ముకున్న దేవుళ్లను వేడుకుంటారు. తల్లి ప్రేమ అలాంటిది మరి.. జిల్లాలో పలువురు తల్లులు తమ బిడ్డల ప్రాణాలను కాపాడడానికి తమ కిడ్నీలను ఇచ్చారు. జిల్లాలో దాదాపు ఇరవై మంది తల్లులు తమ బిడ్డలకు కిడ్నీలు ఇచ్చి పునర్జన్మ ప్రసాదించినట్లు తెలుస్తోంది.

కొడుకుకోసం కిడ్నీ ఇచ్చి..



కామారెడ్డి పట్టణానికి చెందిన శంకర్ అనే యువకుడికి కిడ్నీలు దెబ్బతిని మంచం పట్టాడు. ఆస్పత్రులకు తీసుకువెళ్లి వైద్యం చేయించగా.. కిడ్నీ మార్పిడి చేయాలని వైద్యులు సూచించారు. దీంతో కొడుకుకు తాను కిడ్నీ ఇస్తానంటూ తల్లి పద్మ ముందుకు వచ్చింది. 2022 మార్చి 24న కిడ్నీ మార్పిడి జరిగింది. తల్లీకొడుకులు ఆరోగ్యంగా ఉన్నారు. శంకర్ తన పని తాను చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అమ్మ తనకు పునర్జన్మనిచ్చిందని శంకర్ పేర్కొంటున్నాడు.

కంటికి రెప్పలా చూసుకుంటూ..



బిచ్కుందకు చెందిన గోనె యాదయ్యకు 2012లో కిడ్నీలు దెబ్బతిన్నాయి. దీంతో యాదయ్య తల్లి పోశవ్వ తన కొడుకు కోసం కిడ్నీ ఇవ్వడానికి సిద్ధమైంది. అదే ఏడాది పోశవ్వ కిడ్నీని కొడుకు యాదయ్యకు అమర్చారు. ఇద్దరూ కోలుకున్నారు. అయితే పదేళ్ల పాటు బాగానే ఉన్న యాదయ్యకు మళ్లీ సమస్య మొదలైంది. ఇటీవల డయాలసిస్ చేయించుకుంటున్నాడు. కొడుక్కు కిడ్నీ సమస్య ఎదురైన నాటి నుంచి ఇప్పటి వరకు తల్లి పోశవ్వ కంటికి రెప్పలా కాపాడుకుంటోంది.

కొడుకొస్తాడని..

అన్నల్లో కలిసిన బిడ్డలు

- ఒక్కసారైనా చూడాలని తపించిన తల్లులు
- దశాబ్దాల పాటు ఎదురుచూపులు
- బిడ్డల్ని చూడకుండానే శాశ్వత నిద్రలోకి..



కిష్టాబాయి (స్వామి తల్లి), ఇస్రోజీవాడి



ఎర్రగొల్ల భూమవ్వ (దినేష్ తల్లి), ఆరెపల్లి

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఇస్రోజీవాడికి చెందిన లోకోటి చందర్ అలియాస్ స్వామి మూడున్నర దశాబ్దాల క్రితం అప్పటి పీపుల్స్‌వార్ నక్సలైట్ ఉద్యమంలో చేరారు. తర్వాత ఆయన భార్య, కొడుకు, కూతురు కూడా స్వామి వెంటే అజ్ఞాతంలోకి వెళ్లారు. స్వామి భార్య సులోచన అనారోగ్యంతో చనిపోగా.. స్వామి, ఆయన కొడుకు రమేశ్, కూతురు లావణ్య విప్లవోద్యమంలో కొనసాగుతున్నారు. ఆరెపల్లికి చెందిన ఎర్రగొల్ల రవి అలియాస్ దినేష్ కూడా మూడు దశాబ్దాలుగా అజ్ఞాతంలో ఉన్నాడు.

తెలిసీతెలియని వయసులో అడవిబాట పట్టిన బిడ్డలు ఏదో ఒకరోజు తిరిగొస్తారని లోకోటి చందర్ తల్లి కిష్టాబాయి, ఎర్రగొల్ల రవి తల్లి భూమవ్వ ఆశించారు. దేశంలో ఎక్కడ ఎన్‌కౌంటర్ జరిగినా అందులో తమ బిడ్డలున్నారేమోనని వారి కన్నపేగు విలవిల్లాడేది. ఎవరొచ్చినా కొడుకు జాడ గురించి అడిగేవాళ్లు. ఏడన్న కనబడితే అవ్వ యాజ్జేసిందని చెప్పుండ్రంటూ కంటతడి పెట్టేవాళ్లు. లొంగిపోవాలని కూడా పలుమార్లు కోరారు. కానీ దశాబ్దాలు గడచినా బిడ్డలు ఇంటి ముఖం చూడలేదు. అప్పట్లో ఉత్తరాలు రాశారే తప్ప ఏనాడూ అవ్వ ఎట్లుందో చూడాలనే ప్రయత్నం చేయలేదు. కనీసం తాము తుదిశ్వాస వదిలినపుడైనా వస్తారని, చితికి నిప్పెడతారని ఆశించిన ఆ తల్లులకు నిరాశే ఎదురయ్యింది. లోకోటి చందర్ అలియాస్ స్వామి తల్లి కిష్టాబాయి 2022 ఫిబ్రవరి 12న మరణించారు. ఎర్రగొల్ల రవి అలియాస్ దినేష్ తల్లి భూమవ్వ అదే ఏడాది జూలై 13న అనారోగ్యంతో తనువు చాలించింది. ఇద్దరు తల్లులు తమ బిడ్డల ప్రేమ కోసం తపించి, ఆశ తీరకుండానే ఈ లోకం విడిచివెళ్లారు. దశాబ్దాల క్రితం అజ్ఞాతంలోకి వెళ్లిన కొడుకులు.. కన్నతల్లి మరణించినా ఇంటి ముఖం చూడలేదు.



పైలంగ ఉండమని చెప్పిన

నా కొడుకు సంజీవరెడ్డి మా ఊరు నుంచి మొదట సైన్యంలో చేరిండు. తొమ్మిదేండ్లు జమ్మూలో పనిచేసిండు. ఇప్పుడు అస్సాంలో ఉన్నడు. సెలవులకని వచ్చి నెల కిందనే వెళ్లిండు. రోజూ ఫోన్‌ల మాట్లాడుతున్నడు. ఏం ఇబ్బంది లేదని చెప్పిండు. యుద్ధం చేయడానికి రెడీగా ఉన్నామని అంటుండు. పైలం బిడ్డ అని చెప్పిన. దేవుడు మంచి చేస్తడనే నమ్మకం ఉంది.

–గుట్టకాడి మణెవ్వ, సంజీవరెడ్డి తల్లి



అర్జంటుగ రమ్మంటే నిన్ననే వెళ్లిండు

నా కొడుకు ఎల్లేశ్ తొమ్మిదేండ్లుగా సైన్యంలో పనిచేస్తుండు. జమ్మూ కాశ్మీర్‌లో ఉద్యోగం చేస్తుండు. నెలన్నర కిందట సెలవు తీసుకుని వచ్చిండు. ఇక్కడే ఉండె. నిన్న అర్జంటుగా డ్యూటీకి రమ్మని ఫోన్ రావడంతో బయలుదేరి వెళ్లిండు. జాగ్రత్త బిడ్డా అని చెప్పిన. టీవీల చూస్తుంటే కొంత భయమైతుంది. భగవంతుడి మీద భారం వేసినం.

–పిల్లి నాగమణి, ఎల్లేశ్ తల్లి



కొంత భయమైతుంది

నా కొడుకు సంతోష్ జమ్మూ కశ్మీర్‌లో ఆర్మీలో పనిచేస్తుండు. చాలా ఏళ్లయ్యింది ఉద్యోగంలో చేరి. పాకిస్థాన్‌తో నిన్న మొన్న గొడవలు మొదలైన సంది కొంత భయమైతుంది. దేశం కోసం కొట్లాడుతం అంటడు. జాగ్రత్తలు చెబుతుంటం. ఇంటి దగ్గర ఉన్నోళ్లకు అక్కడ ఏం జరుగుతుందోనని భయమైతుంటది. అందరూ మంచిగ ఉండాలని దేవుళ్లను వేడుకుంటున్నం.

–గొల్ల రాజమణి, సంతోష్ తల్లి



భయపడకు అమ్మా అన్నడు

నా కొడుకు రాజు తొమ్మిదేండ్ల కింద సైన్యంలో చేరిండు. ఇప్పుడు పంజాబ్‌లో పనిచేస్తుండు. పాకిస్థాన్‌తోని లొల్లుల గురించి ఫోన్ల మాట్లాడితే అమ్మ ఏం కాదు అంటడు. పైలంగ ఉండు బిడ్డ అని చెబుతుంటా. భయపడకు అమ్మా అంటూ కొడుకు నాకే ధైర్యం చెబుతుంటడు. మాకేం కాదని అంటుంటడు. కొడుకు మంచిగ ఉండాలని రోజూ అందరు దేవుళ్లను మొక్కుకుంటున్న.

–టేకుల లలిత, రాజు తల్లి



బార్డర్‌లనే పనిచేస్తుండు

నా కొడుకు సంజీవరెడ్డి పదేళ్ల కిందటనే సైన్యంల జేరిండు. ఇప్పుడు రాజస్థాన్‌ల పనిచేస్తుండు. బార్డర్‌ల ఉంటడట. రోజూ ఫోన్ చేసి మాట్లాడుతుండు. పైలం బిడ్డ అని చెబుతున్నం. అక్కడక్కడ గొడవలు నడుస్తున్నయని టీవీలల్ల చూస్తున్నం. వాటి గురించి అడిగితే మేం మంచిగనే ఉన్నమని చెబుతడు. కొడుకు మంచిగ ఉండాలని కోరుకుంటున్న.

–పీసు ప్రమీల, సంజీవరెడ్డి తల్లి



అక్కడ గొడవలు లేవన్నడు

నా కొడుకు ప్రశాంత్ ఉత్తరప్రదేశ్‌ల పనిచేస్తుండు. పన్నెండేండ్ల సంది ఉద్యోగంలో ఉన్నడు. పాకిస్థాన్, ఇండియా లొల్లి గురించి టీవీలల్ల వస్తున్న విషయం అడిగితే ఉత్తరప్రదేశ్‌ల ఏమీ లేదని అన్నడు. జాగ్రత్తగా ఉండమని చెప్పిన. రోజూ ఫోన్ల చేసి మాట్లాడుతున్నం. లొల్లి బందయితే తీరం అయితది. టీవీ చూస్తుంటే మాత్రం కొంత భయమైతది.

–ఆకిటి చంద్రకళ, ప్రశాంత్‌రెడ్డి తల్లి



జాగ్రత్తగా ఉండమని చెప్పిన

నా కొడుకు మహేశ్ ఎనిమిదేండ్ల కిందట సైన్యంలో చేరిండు. ప్రస్తుతం జమ్మూలో పనిచేస్తున్నడు. జాగ్రత్తలు చెప్తుతున్నం. మమ్ములనే ధైర్యంగా ఉండమని చెబుతడు. తమకు ఏమీ కాదని అంటడు. కన్న పేగు కదా మాకు భయమైతుంటది. టీవీలల్ల చూస్తూ ఒక్కోసారి మస్తు భయపడుతుంటం. దేవుడి దయతోని మంచిగ ఉండాలని కోరుకుంటున్న.

–మర్రి పోచవ్వ, మహేశ్ తల్లి

పీజీ ఫలితాల వెల్లడి



బాన్సువాడ రూరల్ : ఎస్‌ఆర్‌ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ, పీజీ (అటానమస్) కళాశాలలో శనివారం పీజీ మొదటి సెమిస్టర్ ఫలితాలను తెలంగాణ యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ సంపత్‌కుమార్ విడుదల చేశారు. ఎంఏ ఇంగ్లిష్ మొదటి సెమిస్టర్‌లో 100 శాతం ఉత్తీర్ణత నమోదయ్యిందని, ఎంఏ తెలుగులో 93 శాతం ఉత్తీర్ణత సాధించారని ఆయన తెలిపారు. విద్యార్థులతో పాటు అధ్యాపకులను అభినందించారు. ఈసందర్భంగా ప్రిన్సిపల్ వేణుగోపాల స్వామి మాట్లాడుతూ తెలంగాణ కామన్ పీజీ ఎంట్రి న్స్ టెస్ట్ నోటిఫికేషన్ విడుదల అయ్యిందన్నారు. మే 19లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తెయూ అడిషనల్ కంట్రోలర్ సంపత్, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ షేక్ అక్బర్ బాషా, అడిషనల్ కంట్రోలర్ అంబయ్య తదితరులు పాల్గొన్నారు.

13న పాలిసెట్

కామారెడ్డి అర్బన్ : జిల్లాకేంద్రంలో మంగళవారం నిర్వహించే పాలిసెట్ కోసం ఏర్పాట్లు చేసినట్లు కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్, పరీక్షల సమన్వయకర్త విజయ్‌కుమార్ తెలిపారు. జిల్లాలో 2,900 మంది పరీక్షలు రాయనున్నారని, వారికోసం ఆరు కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. ఉదయం పదిగంటల నుంచి పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామని, 11 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యం అయినా అనుమతించబోమని పేర్కొన్నారు. హాల్ టికెట్‌పై అభ్యర్థి ఫొటో స్పష్టంగా లేకపోతే గెజిటెడ్ అధికారితో ధ్రువీకరణ చేయించుకుని రావాలని సూచించారు.

పత్రికా స్వేచ్ఛకోసం నిరసన గళం



బాన్సువాడలో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

బాన్సువాడ రూరల్: పత్రికా స్వేచ్ఛను కాపాడాలంటూ బాన్సువాడ జర్నలిస్టులు ఆందోళనకు దిగారు. సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంటిపై ఆంధ్రా పోలీసులు దాడి చేయడాన్ని నిరసిస్తూ శనివారం బాన్సువాడ అంబేడ్కర్ చౌరస్తాలో ధర్నా చేశారు. సాక్షి దినపత్రికపై ఏపీ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడడాన్ని మానుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్‌గౌడ్, చంద్రశేఖర్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకుడు సయ్యద్ లతీఫ్, జిల్లా నాయకులు రాజు, పంతులు నరేష్, జర్నలిస్టులు శ్రీకాంత్‌రెడ్డి, వరప్రసాద్, జకీర్, రామాగౌడ్, శ్రీనివాస్, సుందర్, సలీం, సతీష్‌గౌడ్, సుధాకర్, నబీ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్ల కోసం ఆందోళన



తుజాల్‌పూర్‌లో రాస్తారోకో చేస్తున్న రైతులు

బీబీపేట: అకాల వర్షాలతో ఇప్పటికే నష్టపోతున్నామని, వడ్లను వెంటవెంటనే కొనుగోలు చేసి రైస్‌మిల్లులకు తరలించాలని డిమాండ్ చేస్తూ తుజాల్‌పూర్ రైతులు శనివారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లారీలు రావడం ఆలస్యం కావడం వల్ల కాంటా అయిన వడ్లు పేరుకుపోతున్నాయని, వర్షాలతో తడిసిపోతున్నాయని పేర్కొన్నారు. తడిసిన వడ్లను మిల్లులకు తరలిస్తే అదనపు తరుగు తీస్తున్నారని ఆరోపించారు. అధికారులు, సొసైటీ చైర్మన్ స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పోలీసులు రైతులను సముదాయించారు. సమస్య పరిష్కరిస్తామని అధికారులు చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు.

తాగునీటి కోసం నిరీక్షణ



తాగునీటి కోసం బోరుబావి వద్ద వేచి ఉన్న రతన్ సింగ్ తండావాసులు

పెద్దకొడప్‌గల్: తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని రతన్‌సింగ్ తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు లీకేజీలతో మురికి నీరు సరఫరా అవుతుండడంతో ఆ నీరు తాగలేకపోతున్నారు. దీంతో బోరుబావుల వద్దకు వెళ్లి తాగునీటిని తెచ్చుకుంటున్నారు. అయితే శనివారం తండాలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తాయి. తండావాసులు మండుటెండలో తాగునీటి కోసం గంటల తరబడి బోరుబావి వద్ద వేచి చూడాల్సి వచ్చింది. అధికారులు స్పందించి తాగునీటి గోస తీర్చాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

ఇటుక బట్టీని తొలగించాలని ఫిర్యాదు


ఫిర్యాదు చేస్తున్న సోమేశ్వర్ గ్రామస్తులు

బాన్సువాడ రూరల్: మండలంలోని సోమేశ్వర్ శివారులో గత కొన్నేళ్లుగా కొనసాగుతున్న ఓ ఇటుకబట్టీని తొలగించాలని కోరుతూ శనివారం సోమేశ్వర్ గ్రామస్తులు బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఇటుకబట్టీలతో తమ గ్రామంలోకి ప్రతిరోజు పొగ, దుమ్మూధూళి చేరుతుండటంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. ఇటుకబట్టీ ద్వారా వెలువడే పొగ, డస్టు వల్ల చుట్టూపక్కల పొలాలకు నష్టం వాటిల్లుతోందని ఆరోపించారు.

తాడ్వాయిలో వాహనాల తనిఖీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కామారెడ్డి -ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో శనివారం పోలీసుల వాహనాలను తనిఖీ చేపట్టారు.వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలలేనివారితో పాటు,హెల్మెట్ ధరించని పలువురికి జరిమానా విధించారు. పోలీసు సిబ్బంది,హోంగార్డులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

- డీఎస్పీ విఠల్ రెడ్డి



నస్రుల్లాబాద్(బాన్సువాడ): పోలీసులు విధుల్లో అప్రమత్తంగా ఉండాలని బాన్సువాడ డీఎస్పీ విఠల్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ డయల్ 100కు ఫిర్యాదు వచ్చిన వెంటనే పోలీసులు స్పందించాలన్నారు. సైబర్ క్రైంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట పీఎస్సై అరుణ్ కుమార్, సిబ్బంది శ్రీనివాస్, రాము, సరిత తదితరులు ఉన్నారు.

చోరీల నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలి

మాచారెడ్డి : చోరీలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో మాచారెడ్డి, పాల్వంచ మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాచారెడ్డి ఎస్సై అనిల్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.బయట నిద్రించవద్దని, అనుమానితులు కనబడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఊరికి వెళ్లేటపుడు విలువైన వస్తువులు, ఆభరణాలు, డబ్బులు ఇంట్లో ఉంచవద్దని సూచించారు.జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ప్రారంభమైన పచ్చళ్ల సీజన్


బాన్సువాడ సంతలో మామిడి కాయలు అమ్ముతున్న వ్యాపారులు



మామిడి కాయలు కట్ చేస్తున్న దృశ్యం, మామిడి కాయ పచ్చడిని తయారీ చేస్తున్న ఓ కుటుంబం

- మామిడికాయలు, ఇతర దినుసుల కొనుగోళ్లలో జనం బిజీ
- ఏడాదికి సరిపడా తయారీకి ఏర్పాట్లు

బాన్సువాడ : వేసవి కాలంలో ఏ గ్రామంలో చూసిన మామిడి కాయల సుగంధం, పచ్చడి తయారీ, వడియాల సన్నాహాలతో సందడి నెలకొంటుంది. ఆహార పదార్థాలు మాత్రమే కాదు సంప్రదాయం, కుటుంబ బంధాలు, గ్రామీణ సంస్కృతి సజీవ చిహ్నాలు. పచ్చళ్ల ఆహార సంస్కృతిలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. రుచిని పెంచడమే కాక ఆహారాన్ని సంరక్షించే సంప్రదాయ పద్ధతిగా కూడా పని చేస్తాయి. గ్రామీణ ప్రాంతాలు, గిరిజన గ్రామాల్లో ఆవకాయ పచ్చడి లేని ఇల్లు ఉండదంటే ఆశ్చర్యం కలగక మానదు. బెల్లం ఆవకాయ, మెంతి ఆవకాయ, పులిహోర ఆవకాయ వంటి రకాలు ప్రాంతాలను బట్టి మారుతూ ఉంటాయి. ఈ ప్రక్రియలో కుటుంబ సభ్యులందరూ పాల్గొనడం, పాత తరం నుంచి కొత్త తరానికి జ్ఞానాన్ని అందించడం వంటివి సాంస్కృతిక సంబంధాలను బలపరుస్తాయి.

పచ్చడి తయారీ విధానం..

- గట్టిగా, పుల్లగా ఉన్న పచ్చి మామిడి కాయలను ఎంచుకుని లోపల టెంకలు తీసి ముక్కలుగా కోయాలి.
- ఆవపిండి, ఎండుమిరపకాయల కారం, ఉప్పు, మెంతిపొడి, నువ్వుల నూనె వంటి ప్రధాన పదార్థాలు కలిపేందుకు సిద్ధం చేసుకోవాలి. కొన్ని రకాల్లో బెల్లం, వెల్లుల్లి కూడా కలుపుతారు.
- ఆ తరువాత జాడీలో కారం మిశ్రమాన్ని మామిడి ముక్కలతో పొరలు, పొరలుగా అమర్చి, పైన నూనె పోస్తారు. ఇది పచ్చడిని పాడవకుండా సంరక్షిస్తుంది.
- 34 రోజుల పాటు గాలిచొరబడకుండా మూత పెట్టి ఉంచిన తర్వాత తినడానికి తయారవుతుంది. కొన్ని రకాలు ఎండబెట్టి దీర్ఘకాల నిల్వకు సిద్ధం చేస్తారు.

ఆరోగ్య ప్రయోజనాలెన్నో..

మామిడి పచ్చడిలు రుచికరమైనవే కాకుండా ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉన్నాయి. వీటిని మితంగా తీసుకోవడం ముఖ్యం. పచ్చి మామిడిలో పొటాషియం, ఇతర ఖనిజాల వల్ల వేసవిలో డీహైడ్రేషన్, జీర్ణక్రియను మెరుగుపర్చుకోవడం, మలబద్ధకం వంటి సమస్యలను నివారిస్తాయి. విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు శరీరాన్ని వ్యాధుల నుంచి కాపాడతాయి. జీలకర్ర జీర్ణక్రియను మెరుగురచడంలో సహాయ పడతాయి.

కాయల ఎంపిక ముఖ్యం



మామిడి కాయ పచ్చడి తయారీకి కాయల ఎంపిక చాలా ముఖ్యం. ఇందు కోసం నేను సంతకు వెళ్లి మామిడి కాయలను తీసుకొస్తాను. తర్వాత వాటిని శుభ్రంగా కడిగి ముక్కలు చేసి మసాల ఉప్పు, కారం, ఆవాలు వేసి బాగా కలిపి జాడీల్లో పెడతాం. –శంకర్,బాన్సువాడ

కుటుంబ బంధాలను బలపరుస్తుంది



ప్రతి సంవత్సరం వేసవిలో మామిడి కాయల పచ్చడి చేయడం మాకు ఒక పండుగలా ఉంటుంది. కుటుంబ సభ్యులందరం కలిసి తయారీలో పాల్గొంటాం. ఏడాది పొడవునా రుచిని ఇస్తుంది. అలాగే మా కుటుంబ బంధాలను కూడా బలపరుస్తుంది. –పుష్పలత, శెట్లూరు గ్రామం

'లూపస్'పై అవగాహన అవసరం

నిజామాబాద్‌లో 2కే రన్


రన్ అనంతరం ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

నిజామాబాద్ నాగారం: శరీరంలోని అన్ని భాగాలను ప్రభావితం చేసే 'లూపస్' వ్యాధిపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని వైద్యులు సూచించారు. ప్రపంచ లూపస్ దినోత్సవం సందర్భంగా శనివారం ఐఎంఏ, నిజామాబాద్ రుమటాలజీ అండ్ ఆర్థరైటిస్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించారు. వినాయక్‌నగర్‌లోని హనుమాన్ జంక్షన్ నుంచి రుమటాలజీ అండ్ ఆర్థరైటిస్ సెంట ర్ వరకు రన్ కొనసాగింది. అనంతరం చర్మవ్యాధి నిపుణురాలు గ్రీష్మ మాట్లాడుతూ లూపస్ వ్యాధి కళ్లు, మెదడు,ఊపిరితిత్తులు,మూత్రపిండాలు,రక్త నాళాలు తదితర ఏ భాగాన్ని అయినా ప్రభా వితం చేస్తుందన్నారు.ఐఎంఏ అధ్యక్షుడు డా అజ్జ శ్రీనివాస్, కోశాధికారి డా. రాజేందర్ మాట్లాడుతూ లూపస్ వ్యాధి నివారణకు రుమటాలజిస్టును సంప్రదించి సూచించిన మందులు వాడాలన్నారు. డాక్టర్ జీ రవి కిరణ్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు, మంచినిద్ర, క్రమం తప్పకుండా వ్యాయామం తదితర మంచి జీవనశైలిని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు జీవన్ రావు , శ్రీశైలం, పీబీ కృష్ణమూర్తి ఉన్నారు.

ప్రైవేటు ఆస్పత్రిలో నర్సు మృతి

నిజామాబాద్ నాగారం: జిల్లా కేంద్రంలోని మనోరమ ఆస్పత్రిలో ఓ నర్సు మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా దోంగ్లికి చెందిన శిల్ప నగరంలోని మనోరమ ఆస్పత్రిలో నర్సుగా పని చేస్తోంది. శుక్రవారం రాత్రి శిల్ప విధులకు హాజరుకాగా, జ్వరంతో బాధపడుతూ రాత్రి అదే ఆస్పత్రిలో నిద్రపోయింది. తెల్లవారుజామున తోటి నర్సులు, సిబ్బంది నిద్ర లేపే ప్రయత్నం చేయగా చలనం లేకపోవడంతో వైద్యులు పరీక్షించి శిల్ప మృతి చెందినట్లు గుర్తించారు. స్థానిక ఒకటో టౌన్ పోలీసులు ఆస్పత్రికి చేరుకొని వివరాలు సేకరించారు.

వానరమూక వీరంగం... చిరిగిన షేడ్‌నెట్


కోతుల దాడిలో చిరిగిన షేడ్‌నెట్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పోచారం గ్రామంలో నర్సరీలోని మొక్కలను ఎండతీవ్రత నుంచి కాపాడేందుకు షేడ్‌నెట్ కట్టారు. గత కొన్ని రోజులుగా నర్సరీలోని షేడ్‌నెట్‌పై వానరమూక వీరంగం చేయడంతో చిరిగిపోయింది. గడిచిన రెండునెలల్లో గ్రామంలోని నర్సరీపై ఇప్పటివరకు మూడు షేడ్‌నెట్‌లను ఏర్పాటు చేశారు. కోతులతో నర్సరీపై ఏర్పాటుచేసిన షేడ్‌నెట్ తరుచూ చిరిగిపోతుందని గ్రామపంచాయతీ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాలుగేళ్లుగా కొనసా..గుతూనే


బీర్కూర్ బ్రిడ్జి వద్ద కొనసాగుతున్న చెక్‌డ్యాం నిర్మాణ పనులు

- బీర్కూర్ వద్ద మంజీర నదిలో నెమ్మదిగా చెక్ డ్యాం పనులు
- ఇసుక దందాకు తెరలేపిన అక్రమార్కులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు


పునాదుల వరకు వేసిన సీసీ

బాన్సువాడ : బీర్కూర్ వద్ద మంజీర నదిలో చెక్ డ్యాం పనులు నాలుగేళ్లగా కొనసాగుతున్నాయి. అప్పటి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నాబార్డు నిధులు రూ. 28.29 కోట్ల వ్యయంతో మంజీర నదిపై చెక్ డ్యాం నిర్మాణ పనులకు అప్పటి రోడ్డు, భవనాలు, గృహనిర్మాణం , శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి 2021లో శంకుస్థాపన చేశారు. ఈ బ్రిడ్జి నిర్మాణం చేపట్టే ప్రాంతంలో పూర్తిగా ఇసుక నిండి ఉంది. దీంతో బీర్కూర్‌కు చెందిన కొందరు అక్రమార్కులు అభివృద్ధి పనుల పేరిట ఇసుక అక్రమ రవాణాకు తెరలేపారు. నిత్యం టిప్పర్లలో పదుల సంఖ్యలో బీర్కూర్ నుంచి ఇతర ప్రాంతాలకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న పట్టించుకునే వారే కరువయ్యారు. బీర్కూర్ పోలీస్‌స్టేషన్ ముందు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారే విమర్శలు వినిపిస్తున్నాయి. మరో నెల రోజుల్లో వర్షకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో చెక్ డ్యాం నిర్మాణ పనులకు బ్రేక్ పడే అవకాశం ఉంది. నాలుగేళ్ల క్రితం ప్రారంభమైన పనులు కనీసం 30 శాతం కూడా పూర్తి కాకపోవడం గమనార్హం. బీర్కూర్ బ్రిడ్జి వద్ద చెక్ డ్యాం పనులు పూర్తయితే బీర్కూర్‌తో పాటు కిష్టాపూర్, బరంగెడ్గి, డోంగ్లీ మండలం కుర్లా, శేట్లూర్, ఖత్‌గాం గ్రామాలకు భూగర్భ జలాలు వృద్ధి చెందే అవకాశం ఉంది. అధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తి చేయాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

జిల్లా కీర్తిని ప్రపంచానికి చాటిన సౌమ్య


ఫుట్‌బాల్ అంతర్జాతీయ క్రీడాకారిణి సౌమ్యను సన్మానిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్‌నాగారం: జిల్లాకు చెందిన క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రతిభ చాటుతూ జిల్లా కీర్తిని ప్రపంచ వ్యాప్తంగా చాటుతున్నారని, ఫుట్‌బాల్ క్రీడాకారిణి గుగులోత్ సౌమ్య మరింత చాటిందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ కొనియాడారు. జిల్లా కేంద్రంలోని గీతా భవనంలో శనివారం నిజామాబాద్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ జట్టులో స్థానం పదిలం చేసుకున్న గుగులోత్ సౌమ్యకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ హాజరై ఆమెను అభినందిస్తూ సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడాకారులకు ప్రోత్సాహాన్ని అందించేందుకు తాను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుతో కలిసి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, ఉపాధ్యక్షుడు భక్తవత్సలం మాట్లాడుతూ.. ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా జిల్లాకు ప్రత్యేక క్రీడామైదానంతోపాటు కోచ్‌లు, వసతులు లేక క్రీడాకారులు ఇక్కట్లకు గురవుతున్నారన్నారు. కోచ్ నాగరాజు, నిఖత్ జరీనా, భూమ్‌రెడ్డి సంజీవరెడ్డి, అబ్బన్న, రమేశ్, ఉమర్, సురేశ్, జావీద్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ చెప్పినా కరుణించరా?


పెద్దవాగు రోడ్డుపై ఉన్న ధాన్యం బస్తాలు


ధాన్యం కుప్పపై వేసిన ముళ్ల కంప

- పెద్దవాగు రోడ్డుపై ధాన్యం బస్తాలు
- రెండు రోజుల్లో తరలించాలని అధికారులను ఆదేశించిన కలెక్టర్
- ఇప్పటికీ కదలని ధాన్యం బస్తాలు

బాల్కొండ: రహదారిపై కిలోమీటర్ల మేర ఉన్న ధాన్యం బస్తాలను రెండ్రోజుల్లో తరలించాలని సాక్షాత్తు జిల్లా పాలనాధికారి ఆదేశించినా అధికారుల్లో చలనం లేదు. ముప్కాల్ మండలం వెంచిర్యాల్ గ్రామశివారులో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రెండు రోజుల క్రితం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు పరిశీలించారు. జాతీయ రహదారి 44 నల్లూర్ చౌరస్తా నుంచి పెద్ద వాగు వరకు సుమారు 10 కిలో మీటర్ల మేర రోడ్డుపై ధాన్యం బస్తాలు, వడ్ల కుప్పలను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కారణాలు చెప్పకుండా రెండ్రోజుల్లో బస్తాలను తరలించాలని అధికారులను ఆదేశించారు. కానీ, పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంలా ఉంది. తూకం వేసి నెల రోజులు దాటుతున్నా ధాన్యం బస్తాలు తరలించక పోవడంతో రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. స్వయంగా కలెక్టరే పరిస్థితిని గమనించి అధికారులను ఆదేశించినా ప్రయోజనం లేకపోవడంతో నిట్టూరుస్తున్నారు. మరోవైపు నెలల తరబడి ధాన్యం తూకం వేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం గాలివాన కురుస్తుండడంతో ధాన్యం కుప్పలపై ముళ్లకంపలు వేస్తున్నారు. అధికారులు స్పందించి కొనుగోళ్ల వేగవంతం చేసి, ధాన్యం బస్తాలను తరలించాలని వేడుకుంటున్నారు.

నెల రోజులవుతోంది..

పెద్దవాగు రోడ్డుపై ధాన్యం ఆరబెట్టి కుప్పలు చేసి నెల రోజులు గడుస్తోంది. ఇప్పటి వరకు బస్తాలు నింపి కాంటా వేయలేదు. ధాన్యం నింపిన బస్తాలను మిల్లుకు తరలించలేదు. కలెక్టర్ చెప్పినా పట్టించుకోవడం లేదు.
– గంగారెడ్డి, రైతు, నాగంపేట్

గ్యాస్ సిలిండర్ లీక్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని తాండూర్ గ్రామంలోని ఓ ఇంట్లో వంటగ్యాస్ సిలిండర్ లీకైన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. తాండూర్‌కు చెందిన వృద్ధ దంపతులు దుర్గం రాములు, పెంటమ్మ ఇంట్లో సాయంత్రం గ్యాస్ సిలిండర్‌పై వంట చేస్తుండగా ఆకస్మికంగా గ్యాస్‌పైపు లీకై మంటలు వచ్చాయి. భయపడిన వృద్ధదంపతులు గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు ఇంట్లోకి వెళ్లి మండుతున్న గ్యాస్ సిలిండర్‌ను బయటికి తీసుకొచ్చారు. అనంతరం మంటలను ఆర్పివేయడంతో ప్రాణాపాయం తప్పింది.

అసభ్యకర పోస్టింగ్‌పై ఫిర్యాదు

నవీపేట: మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టింగ్ చేయడంపై బీజేపీ నాయకులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రధాని, కేంద్ర హోం మంత్రి, పలు రాష్ట్రాల సీఎంల చిత్రాలను మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశాడు. ఫొటో వైరల్ కావడంతో నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు బూనాది ప్రవీన్, సందీప్, అజయ్, దినేశ్, రాహుల్ ఫిర్యాదు చేశారు.

నల్లమట్టి లారీ బోల్తా


బోల్తాపడిన నల్లమట్టి లారీ

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండలంలోని విజయనగరం గ్రామం వద్ద నల్లమట్టిని తరలిస్తున్న లారీ బోల్తా పడింది. నిర్మల్ జిల్లా పంచగూడ గ్రామ సమీపంలోని గోదావరి పరీవాహక ప్రాంతం నుంచి ఆర్మూర్ పరిసర ప్రాంతాలకు నల్లమట్టిని తరలిస్తుండగా భారీ లారీ విజయనగరం గ్రామ సమీపంలోని కల్వర్టు వద్ద బోల్తా పడింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రోడ్డుపై నుంచి లారీతోపాటు నల్లమట్టిని తొలగించడంతో రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.

ఈత చెట్లు దగ్ధం


కాలిపోయిన ఈత చెట్లు

రుద్రూర్: మండలంలోని రాణంపల్లి శివారులో శనివారం మధ్యాహ్నం ఈత చెట్లు దగ్ధమయ్యాయి. సమీప పొలంలో నుంచి వచ్చిన మంటలతో 40 ఈత చెట్లు కాలిపోయినట్లు బాధితులు తెలిపారు. బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని బాధితులు అధికారులను కోరారు.

క్రైం కార్నర్

భార్యను కడతేర్చిన భర్త


లావణ్య తల్లిదండ్రుల నుంచి వివరాలను సేకరిస్తున్న ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్

ఆర్మూర్‌టౌన్: కట్టుకున్న భర్తే ఆమె పాలిట యముడయ్యాడు. అనుమానంతో భార్యను బెడ్‌షీట్‌తో ఊపిరి ఆడకుండా చేసి దారుణంగా హత్య చేసిన ఘటన ఆర్మూర్ మున్సిపల్ పరిధి పెర్కిట్‌లోని తిరుమల కాలనీలో శనివారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జక్రాన్‌పల్లి మండల కేంద్రానికి చెందిన లావణ్య(28)కు తొమ్మిదేళ్ల క్రితం ఆకుల ప్రవీణ్‌తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు అక్షయ, అద్వైత, ఒక కుమారుడు నిహాల్ ఉన్నాడు. కుటుంబ ఆర్థిక ఇబ్బందులతోపాటు భార్యపై అనుమానంతో తరచూ గొడవలు జరుగుతుండేవి. శుక్రవారం రాత్రి ప్రవీణ్‌తో లావణ్య గొడవకు దిగింది. గొడవ ముదరడంతో కోపోద్రిక్తుడైన ప్రవీణ్ బెడ్‌షీట్‌తో లావణ్యకు ఊపిరి ఆడకుండా చేసి హత్య చేశాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ప్రవీణ్‌ను అదుపులో తీసుకున్నారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు.

బైక్, లారీ ఢీ.. ఒకరి మృతి

సదాశివనగర్: సదాశివనగర్ మండలంలోని మోడేగావ్ శివారులో బైక్, లారీ ఢీకొన్న ఘటనలో బైకుపై ప్రయాణిస్తున్న ఒకరు మృతి చెందినట్లు ఎస్సై రంజిత్ శనివారం తెలిపారు. చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన నర్సాగౌడ్(55) మొండి సడక్ నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా మోడేగావ్ శివారులో లారీ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ఘటనా స్థలంలోనే నర్సాగౌడ్ మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చేపలవేటకు వెళ్లి వృద్ధుడి దుర్మరణం

రుద్రూర్: పొతంగల్ మండల శివారులోని మంజీరా నదిలో చేపలవేటకు వెళ్లిన తోకల గంగారాం (65) అనే వృద్ధుడు ప్రమాదవశాత్తు నీటిలో జారిపడి మృతి చెందినట్లు కోటగిరి ఎస్సై సునీల్ తెలిపారు. శనివారం ఉదయం చేపలు పడుతుండగా గంగారాం ప్రమాదవశాత్తు తెప్పపై నుంచి నీటిలో జారి పడిపోయాడు. చేపలు పట్టే వల కాళ్లకు చుట్టుకోవడంతో నీటమునిగి ఊపిరి ఆడక మృతి చెందాడు. మృతుడి భార్య తోకల లచ్చవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధురాలు..

మాక్లూర్: మండలంలోని అమ్రాద్ శివారులో ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన శనివారం సుమారు 60 ఏళ్ల వృద్ధురాలి శవాన్ని గుర్తించినట్లు మాక్లూర్ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. వృద్ధురాలి గురించి తెలిసిన వారు ఎవరైనా ఉంటే మాక్లూర్ పోలీసులను సంప్రదించాలని పేర్కొన్నారు. మృతదేహాన్ని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

రెంజల్(బోధన్): మండలంలోని దూపల్లి గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. గ్రామానికి చెందిన గోపాల్ గంగారాం(60) శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి స్థానిక చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం స్థానికులు గుర్తించి సమాచారం అందించడంతో పంచనామా నిర్వహించి మృతదేహాన్ని బోధన్‌లోని జిల్లా ఆస్పత్రికి తరలించామన్నారు. కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జాన్కంపేట లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో చోరీ


హుండీని పరిశీలిస్తున్న ఎస్సై వంశీకృష్ణారెడ్డి

ఎడపల్లి (బోధన్): మండలంలోని జాన్కంపేట్ గ్రామ శివారులో గల లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో చోరీ జరిగినట్లు ఆలయ పూజారి రఘు శనివారం తెలిపారు. దుండగులు ఆలయంలోని హుండీని వెల్డింగ్ కట్టర్లతో ధ్వంసం చేసి భక్తులు సమర్పించుకున్న నగదు, వెండి, బంగారం నగలను ఎత్తుకెళ్లారన్నారు. సమాచారం అందుకున్న ఎస్సై వంశీకృష్ణారెడ్డి ఆలయాన్ని సందర్శించి హుండీని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వాహనాలు సీజ్


వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై రాఘవేంద్ర

లింగంపేట(ఎల్లారెడ్డి): చలాన్లు చెల్లించకుండా తిరుగుతున్న రెండు వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్సై రాఘవేంద్ర తెలిపారు. లింగంపేట మండలం ముస్తాపూర్ గ్రామం వద్ద ఆయన శనివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. సీజ్ చేసిన వాహనాలపై రూ. 3450 చలాన్ పెండింగ్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. మరో 23 వాహనాలను తనిఖీ చేసి హెల్మెంట్, డ్రైవింగ్ లైసెన్సు లేని వాహనదారులకు జరిమానా విధించామన్నారు. ఆయన వెంట సిబ్బంది రాజు, జువ్వినాయక్, మదన్ లాల్, వసంత్ ఉన్నారు.